సీరియల్

# అగ్ని శిఖరం

## ప్రతాప రవిశంకర్

(గత సంచిక తరువాయి)

దీపం కాంతిలో బండమీద వెంటనే జాన్సన్ కనిపించలేదు.

జాన్సన్ ఏమయ్యాడు!

ఎర్రతో దేళ్ళు తినేసి వెళ్ళిపోయాయా?

మరింత ముందుకు వంగి కళ్ళను చిట్లించి చూసింది.

షాక్ కొట్టినట్టు అదిరిపడింది.

విల్లి కింతలా పడుకున్న జాన్సన్ శరీరాన్ని అప్పటికే ఒక వరుస చుట్టుకుపోయి రెండో వరుస చుట్టటానికి తంటాలు పడుతున్న పెద్ద కొండచిలువ కనబడింది.

మై గాడ్!

హారిబుల్..జాన్సన్ మనిషి కాదా? మనిషే అయితే కొండచిలువ అలా శరీరాన్ని చుట్టుకుపోతుంటే ఇంకా గుర్రుపెట్టి నిద్రపోతూనే వుంటాడా?

నిజంగా నే మొరటు మనిషి—

ఒక్క నిమిషం దాన్ని ఎలా ఎదుర్కోటానికీ తోచ లేదు. రివాల్వర్‌తో షూట్ చెయ్యొచ్చు. కాని అది వెంటనే చావకపోవచ్చు. కోపంతో తన పట్టును జాన్సన్ చుట్టూ గట్టిగా బిగించవచ్చు.

అందుకే కిందికి వంగి పెట్టెలో నించి పొడుగాటి కత్తిని బయటకు తీసింది.

తళతళ మెరుస్తోంది కత్తి. బాగా పదునుగా వుంది. అది టకారాలను ఎదుర్కోటానికి తీసుకు వెళుతున్న కత్తి. అలాంటి కత్తులు ఇంకా కొన్ని వున్నాయి.

లేచి నిల్చుని డోర్ తెరుచుకుని రాబోతూ ఆగి పోయింది. బయట యెక్కడయినా చీకట్లో ఎర్ర తోడేళ్ళు పొంచివున్నాయేమో!

ఎవర్నయినా నిద్రలేపితే? మళ్ళీ అనవసరం అనుకుంది.

ఎర్ర తోడేళ్ళు వున్నట్లయితే జాన్సన్ శరీరం కొండ చిలువకు దొరికేది కాదు. ఎప్పుడో అతన్ని ముక్కలు ముక్కలుగా చీల్చి వుండేవి.

క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా డోర్ తెరుచు కుని బయటకు దూకి బండ దగ్గరకు పరిగెత్తింది.

ఆ దృశ్యాన్ని దగ్గరినించి చూడగానే సెలాకు ఒళ్ళు జలదరించింది.

జాన్సన్ శరీరాన్ని ఒక చుట్టు చుట్టుకొని రెండో చుట్టుకు తలను అతడి కాళ్ళకిందనించి బయటకు తెప్పిస్తోంది.

ఇంకేమీ ఆలోచించలేదు. అంతకుమించి దాన్ని చంపటానికి సరైన ఒడుపు దొరకదనుకుంది.

అది తలను పూర్తిగా బయటకు తీసుకొచ్చి పైకెత్తిందంటే దాన్ని చంపటం కష్టమవుతుంది. ఎందుకంటే

కత్తివేటు జాన్సన్‌కు కూడా తగిలే అవకాశం వుంది.

అంతే—

తల రెండు జానల పొడవునా బండమీద బయటకు వచ్చింది.

సెల్లా చేతిలో కత్తి విసురుగా పైకిలేచి వేగంగా కిందికి దిగింది.

అంతే—ఒకే ఒక్క వేటు....ఆ వేటుకే అంత పెద్ద కొండచిలువ తల తెగిపోయి కొంచెం దూరంలో పడి పోయింది. తల తెగిపోవటంతోనే నెత్తురు చిమ్మింది. వెంటనే జాన్సన్‌ను చుట్టుకొన్న చుట్ట విడిపోయింది.

బండమీదనించి కిందికి దొర్లుతున్నప్పుడు జాన్సన్‌కు మెలకువవచ్చి దొర్లకుండా ఆగిపోయాడు.

కళ్ళు తెరిచి చూసేసరికి అస్పష్టంగా పడుతున్న వెలుతురులో యెదురుగా పొడుగాటి కత్తి తీసుకొని నిల్చున్న సెల్లా కనపడింది.

అదిరిపడి పక్కనేవున్న రివాల్వర్‌ను అందుకోటానికి చేతినిపక్కకు జరిపాడు జాన్సన్ లేచి కూర్చోబోతూ—

అప్పుడు తగిలింది అతని చేతికి విడిపోయిన కొండ చిలువ శరీరం. చూశాడు. చటుక్కున చేతిని వెనక్కి లాక్కొని బెదురుతున్న కళ్ళతో సెల్లాను చూశాడు.

"భయపడకు. అది చచ్చిపోయింది" అన్నది సెల్లా.

అప్పుడతను టార్చి తీసుకొని ఫోకస్ చేసి చూశాడు. తల తెగిన కొండచిలువ శరీరం ఒకవైపు, తెగిపోయిన తల రెండోవైపు భయంకరంగా కనిపించాయి.

"నువ్వింత మొద్దువని అనుకోలేదు. కొండచిలువ చుట్టుకుపోతున్నా నీకు మెలకువరాలేదు. వినా మా అందరికీ కాపలా వున్నవాడివి నువ్వెలా నిద్రపోయావ్?

నీ మొద్దు నిద్రే నిన్ను ఆపదలోకి నెట్టింది. నీ గురకే నిన్ను రక్షించింది. నీ గురకతోనే నాకు మెలకువ వచ్చి చూశాను. నాకు మెలకువ రాకుండా వున్నట్టయితే నువ్వు ఈ కొండచిలువ పట్టునించి గింజుకున్నా వదిలించుకునే వాడివి కాదు."

సెల్లా మాటలకు జాన్సన్ మాట్లాడలేదు.

సిగ్గుతో తల వంచుకున్నాడు.

ఇలా జరుగుతుందని పొరపాటునకూడా వూహించలేదు.

మరోసారి వాచీకేసి చూసుకుంది సెల్లా.

పదినిముషాలు తక్కువ ఒంటిగంట.

"ఒంటిగంట కావస్తోంది. ఇక నువ్వెళ్ళి పడుకో. నాలుగు గంటల వరకు నేను కాపలా వుంటాను."

"వద్దు.... ఇక నాకు నిద్రపట్టదు. నువ్వొక్కదానివే కూర్చోటానికి విసుగుపుడుతుందేమో! నేనుకూడా నీకు తోడు వుంటాను" అన్నాడు జాన్సన్—కొండచిలువ శరీరాన్ని కొంచెం దూరానికి నెట్టివేస్తూ.

"నీ యిష్టం. నిద్ర రాకపోతే ఫర్వాలేదు. నేను కూడా నీలాగే నిద్రపోతానని అనుకోకుండా వుంటే చాలు" అన్నది సెల్లా నవ్వుతూ.

మళ్ళీ సిగ్గుపడ్డాడు జాన్సన్.

"బాధపడకు.... జోక్‌గా అన్నాను. మరొకరి ప్రాణాలను కాపాడే బాధ్యతను తీసుకున్నప్పుడు బాధ్యతతోనే ప్రవర్తించాలి. అలా కానప్పుడు ఇలాంటి ప్రమాదాలే ఎదురౌతాయి" అంది.

తల వూపాడు జాన్సన్ నిజమే అన్నట్టు.

సెల్లా అతడి పక్కనే కూర్చుంది.

నిజంగానే జాన్సన్ నిద్ర ఎగిరిపోయింది. అతడికి జరిగిపోయిన సంఘటన తల్చుకుంటే భయమేసింది. సెల్లాకు మెలకువ రాకుండా వున్నట్లయితే తన గతి ఏమై వుండేది. తను ఎంత బలవంతుడైనా చెయ్యగలిగింది యేమీ వుండేదికాదు. కొండచిలువ పట్టు చాలా భయంకరమైనది.

తను తక్కువగా అంచనా వేసుకున్న ఆడదే ఎంతో సాహసంతో తన ప్రాణాలను కాపాడింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?" అడిగింది సెల్లా.

ఏమీ లేదన్నట్టు తలవూపాడు. ఆమెకు కృతజ్ఞతలు తెలియజేసుకోటానికి జాన్సన్ బిడియపడ్డాడు.

"జాన్సన్....నిద్రలో నాకు మెలకువ వచ్చినప్పుడు యేదో పాట వినపడింది. నువ్వేకదా ఆ పాట పాడింది."

తల వూగించాడు జాన్సన్.

"మళ్ళీ ఆ పాట పాడు. నాకు మీ పాటలంటే ఇష్టం. అప్పుడప్పుడు భారత్ పాడుతూ వుండేవాడు."

రెండు నిముషాల తర్వాత జాన్సన్ పాట మొదలు పెట్టాడు.

చూటానికి అతను మొరటుగా వున్నా మాట్లాడుతున్నప్పుడు అతని గొంతు బొంగురుగా వున్నా పాట పాడుతున్నప్పుడు అతడి గొంతు బావుంది.

సెల్లాకు ఆశ్చర్యం కలిగించిన విషయం అదొక్కటే.

పాట సగంలో వున్నప్పుడు సెల్లా హటాత్తుగా "జాన్సన్. పాట ఆపు" అంది—రివాల్వర్‌ను చేతిలోకి తీసుకుంటూ.

• • •

"జాగ్రత్తగా విను. చెట్లమధ్యగా ఎండుటాకులమీద ఎవరో నడుస్తున్నట్టుగా చప్పుడు వినపడుతోంది" అంది

సెలా.

జాన్సన్ వూపిరి తీసుకోవటం కూడా ఆపి చెవులు రిక్కించి విన్నాడు. అవును. ఎవరో ఆకులమీద నడుస్తున్నట్టుగా టపటపమని చప్పుడవుతోంది. ఎంతో జాగ్రత్తగా వింటేగాని ఆ చప్పుడు తెలీదు.

సెలా చిన్న అలికిడినికూడా వెంటనే గుర్తించగలదనుకున్నాడు.

"అవును. ఎవరో నడుస్తున్నారు. సందేహం లేదు" అన్నాడు జాన్సన్.

"జాగ్రత్తగా వింటే ఆ చప్పుడు ఆగకుండా ఒకేసారి ఒకరు కంటే ఎక్కువమంది నడుస్తున్నట్టుగా వుంది. ఈ నికోలాయ్ దీవుల్లో మనుష్య సంచారం అసలు వుండదని ప్రొఫెసర్ అనంత్ చెప్పాడు. మనుషులు కానప్పుడు ఆ అడుగుల చప్పుడు ఎవరిదై వుండాలి, జంతువులదై వుండాలి. ఒకేసారి అన్ని జంతువులు కలిసివస్తున్నాయంటే అవి తప్పకుండా ఎర్రతోడేళ్ళై అయివుండాలి" అన్నది. అంటూనే జాన్సన్ చేతిలోనించి టార్చిలైటును తీసుకుని చప్పుడు వినవస్తున్న దిశగా చెట్లవైపు ఫోకస్ చేసింది.

సెలా అంచనా తప్పుకాలేదు.

నిజమే అయ్యింది.

ఎర్రతోడేళ్ళు! చెట్లలోనించి వరుసగా ఒక్కొక్కటే బయటకు వస్తున్నాయి తాపీగా.

ఒకటికాదు—రెండుకాదు. ఎనిమిది తోడేళ్ళు వున్నాయి. క్షణాలమీద ఒక నిర్ణయానికి వచ్చేసింది సెలా.

ఎనిమిది తోడేళ్ళను ఎదిరించటం ఇద్దరికి సాధ్యంకాదు. పైగా జిత్తులు కలిగిన తోడేళ్ళు. ఇద్దరే వున్నారని తెలిసినప్పుడు వాటి ధైర్యం రెండింతలవుతుంది.

అందుకే—

"భారత్" అంటూ పెద్దగా అరిచింది.

ఆ అరుపుకు భారత్‌తో పాటు మిగిలిన వాళ్ళంతా ఉలిక్కిపడి లేచారు.

అప్పటికి ఎర్రతోడేళ్ళన్నీ చెట్లలోనించి ముందుకువచ్చి కొంచెం దూరంలో నిలబడివున్న పైలెట్లను చూస్తున్నాయి ముందుకు దూకటానికి సిద్ధంగా వున్నట్టు—

"ఎర్రతోడేళ్ళు వచ్చాయి. దాడిచేయటానికి సిద్ధంగా వున్నాయి. అంతా తుపాకులతో బయటకు రండి. లైట్లన్నీ వెలిగించండి."

అంతే. బయట పరిస్థితి అరక్షణంలో మారిపోయింది. వెంటనే హెలికాప్టర్ లైట్లన్నీ వెలిగాయి.

ఒక్కసారిగా వెలుతురుపడేసరికి ఎర్రతోడేళ్ళన్నీ అటూ ఇటూ కదిలి ఒకదాన్నొకటి చూసుకున్నాయి.

క్షణాలమీద తుపాకులు తీసుకుని ఒకొక్కరే కేబిన్‌లోనించి కిందికి దూకారు.

లీల మాత్రం లోపల వుండిపోయింది.

పైలెట్ కూడా కిందికి దూకపోయాడు కాని భారత్ వారించాడు. అతడ్ని తుపాకి పట్టుకుని లోపలే వుండమన్నాడు. అతనికి యేదైనా గాయమయిందంటే హెలికాప్టర్ కదలదు.

కిందికి దిగుతూనే చెట్లముందు నిల్చుని వున్న ఎర్రతోడేళ్ళు కనిపించాయి.

"మైగాడ్! మన అంచనా నిజమే అయ్యింది. ఈ సమయంలో మనమంతా గాఢనిద్రలో వుంటామని అనుకుని ఇప్పుడు వచ్చాయి" అన్నాడు అనంత్.

అంతా బండ దగ్గరకు వెళ్ళారు.

రంజిత్ కు నిద్రమత్తు వదిలిపోయింది.

అప్పటికే సెల్లా అక్కడవుండటం భారత్ తో పాటు మిగిలిన వాళ్ళకి ఆశ్చర్యాన్ని కలిగించింది.

భారత్ — సెల్లాను యేదో అడగబోయాడు.

కాని ఆమె దృష్టి తీక్షణంగా ఎదురుగా వున్న తోడేళ్ళమీదే వుంది. అవి పరుగుపందానికి సిద్ధంగా వున్నట్టుగా వరుసగా నిలబడి వున్నాయి.

అప్పుడప్పుడు నోళ్ళు తెరుస్తున్నాయి. అలా తెరుస్తున్నప్పుడు వాటి కోరలు అసహ్యంగా కనపడుతున్నాయి. అన్నీ ఒకే ఎత్తులో వున్నాయి.

అవి ఎందుకలా నిలబడిపోయాయో సెల్లాకు అర్థం కాలేదు.

దాడి చెయ్యటానికి వచ్చి అవి ఎందుకలా నిలబడిపోయాయి? తమ చేతుల్లో వున్న ఆయుధాలను చూసి జంకుతున్నాయా?

ఊహు.... అయివుండదు.

జాగ్రత్తగా చూస్తే ఆ ఎర్రతోడేళ్ళు తమని సూటిగా చూడటం లేదని, తమ వెనకవైపుకు చూస్తున్నాయని సెల్లాకు అనిపించింది.

వెంటనే ఆమెకు యేదో స్ఫురించింది.

చటుక్కున తల వెనక్కు తిప్పిచూసి కెవ్వున అరిచి అరుస్తూనే రివాల్వర్ ను పేల్చింది సెల్లా.

అప్పటికే వెనకనించి దగ్గరకు వచ్చేశాయి రెండు ఎర్రతోడేళ్ళు. అదిరిపోయారంతా.

సెల్లా పేల్చిన రివాల్వర్ గుండు ఒకదానికి నుదుటిలో దూరిపోయి పెద్దగా అరుస్తూ వెనక్కుపడింది.

రెండో తోడేలు ఎగిరి సెల్లామీదకు దూకింది భీకరంగా

చూస్తూ.

పక్కకు తప్పుకుంటూ అరిచింది స్టెల్లా కంగారుగా.

"ఎవ్వరూ వెనక్కు తిరగొద్దు. ముందునించి ఎర్ర తోదేళ్ళు దాడిచేస్తాయి."

అప్పటికే ముందునించి ఎర్ర తోదేళ్ళు ఒక్కసారిగా పరుగుదీస్తూ ముందుకు వచ్చాయి.

"షూట్" అరిచాడు భారత్ తుపాకీ పేలుస్తూ....

అతని గురి తప్పలేదు. తుపాకీగుండు ఓ ఎర్రతోదేలును బలితీసుకుంది. అది ఎగిరి పక్కనే వున్న మరో తోదేలు మీద పడింది.

స్టెల్లా పక్కకు తప్పుకోవటంలో ముందుకు తిరగబోతున్న జాన్సన్ మీద పడింది ఎర్రతోదేలు. వెంటనే అతను కిందపడిపోయాడు. ప్రమాదాన్ని గ్రహించిన స్టెల్లా అర సెకనుకూడా ఆలస్యం చెయ్యకుండా కత్తి అందుకుంది. జాన్సన్ పీకను నోరు తెరిచి అందుకోబోతున్న ఎర్రతోదేలు నడుంమీద బలంగా విసిరింది.

అంతే_అది సగానికి తెగిపోయింది.

స్ప్రింగ్ లా ఎగిరి నిలబడ్డాడు జాన్సన్.

లేస్తూనే తుపాకితో, పరిగెత్తుకు వస్తున్న ఎర్ర తోదేళ్ళ గుంపుకేసి గురిచూసి కాల్చాడు జాన్సన్. పేల్చిన తుపాకిగుండు మరో ఎర్రతోదేలు మెడకింద భాగంలో దిగబడింది.

అక్కడికక్కడే కూలిపోయింది.

పైలట్ కుకూడా తుపాకుల చప్పుడు వినగానే ఉత్సాహం కలిగింది. పైగా అవి గుంపుగా ఒక్కసారి వస్తూ వుండటంతో అంతగా గురిలేకపోయినా ఏదో ఒక దాన్ని పడగొట్టవచ్చునసే ఆలోచన వచ్చింది.

లీల మాత్రం లోపల కూర్చుని భయంతో వణికి పోతోంది.

పైలట్ డోర్ దగ్గర నిలబడి ఎర్రతోడేళ్ళ గుంపు కేసి పేల్చాడు. అతని వూహ నిజమే అయ్యింది. గురి లేకుండా పేల్చిన తుపాకీగుండు పరుగుదీస్తున్న ఒక ఎర్రతోడేలు పొట్టలో దిగబడిపోయింది.

భయంకరంగా అరిచింది.

ఆ ఉత్సాహంతో మరోసారి పేల్చాడు తుపాకిని. ఈసారి గుండు మరో ఎర్రతోడేలును పడగొట్టింది.

ఇక మిగిలిన నాలుగు ఎర్రతోడేళ్లు భయపడి పారి పోలేదు. పౌరుషంగా ముందుకు దూసుకుని దగ్గరగా వచ్చేశాయి.

రంజిత్ రెండుసార్లు తుపాకి పేల్చాడు కాని ఒక్క గుండుకూడా ఎర్రతోడేళ్లకు తగల్లేదు.

బాగా దగ్గర వచ్చేశాయి ఎర్రతోడేళ్ళు. ఒక చేత్తో రివాల్వర్, మరో చేత్తో కత్తిని పట్టుకుంది స్టెల్లా.

ముందుకు వచ్చిన తోడేళ్ళలో ఒకటి ఎగిరి రంజిత్ మీద పడిపోయింది. ఆ విసురుకు అతను కిందపడి పోయాడు. చేతిలో వున్న తుపాకి దూరంగా పడింది.

మిగిలినవాళ్ళు ఎర్రతోడేళ్ళకు అందకుండా పక్కకు తప్పుకున్నారు.

భారత్ హెలికాప్టర్ వైపు పరుగుదీశాడు.

పెద్దగా భయంతో కేకపెట్టాడు రంజిత్.

ఎర్రతోడేలు గోళ్ళతో అతని పొట్టమీద గీరుతూ నోరు తెరిచి పళ్లతో అతని గుండెలను చీల్చబోతోంది.

(సశేషం)